క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మజ్జిగ జైపాల్ కాలికి ప్రమాదవశాత్తు గాయమై చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం పరామర్శించారు. మండల అధ్యక్షుడు శంకర్ రెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, అధికార ప్రతినిధి రవీందర్, ఎంపీటీసీ కల్పన మధుకర్, సురేష్, దయాకర్, రాజిరెడ్డి, సంపత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఆలయంలో జరగనున్న అయ్యప్ప మాలధారుల అన్నదాన వాల్‌పోస్టర్లను మంత్రితో కలిసి ఆవిష్కరించారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు యేలిశాల ఆనంద్‌కుమార్, దాసరి రాజేష్, కూచన రవీందర్, పాలకోజు కరుణాకర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావును కలిసిన ప్రభాకర్

ఖిలా వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు, చిరంజీవి అభిమాన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యాడ (కరాటే) ప్రభాకర్ గౌడ్, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళికి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే..



కరీమాబాద్ : రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, తనకు పార్టీ ఎలాంటి అవకాశం ఇచ్చిన పనిచేస్తానని బీజేపీ జాతీయ నాయకుడు, పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ పాలసాని మురళీధర్ రావు అన్నారు. నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన బీజేపీ గెట్ టు గెదర్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు కృషిచేసినందుకు మురళీధర్ రావును పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పాలసాని మురళీధర్ రావు వరంగల్ ముద్దుబిడ్డ అని, ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఏపని అయినా నిబద్ధతతో చేసి, పార్టీ విజయానికి కష్టపడిన మురళీధర్‌రావు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేయాలని కోరారు. ఆయనకు మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే గెలుపునకు కృషిచేస్తామని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, వంగాల సమ్మిరెడ్డి, సముద్రాల పరమేశ్వర్, ఎడ్ల అశోక్‌రెడ్డి, కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ పాల్గొన్నారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణం తొలగింపు



ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీ రోడ్డుపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని బల్దియా అధికారులు తొలగించారు. అక్రమ నిర్మాణంతో కాలనీ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహానగర పాలక సంస్థలో కాలనీ అధ్యక్షుడు ఎనుగంటి రాజు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బల్దియా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాన్ని శనివారం తొలగించారు. కార్యక్రమంలో సుధాకర్, రమేష్, కుమారస్వామి, రాధాకృష్ణ, తోట చందర్, చంద్రయ్య, జక్కన, అజయ్, శివ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష నామార్చన

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు శనివారం లక్ష్మీనారాయణుల లక్ష సహస్ర నామార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారితో పాటు శ్రీనివాసుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. పలువురు మహిళలు భక్తిగీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాకు అన్యాయం చేయొద్దు..

- ప్రభుత్వ ఏర్పాటులో మా పాత్ర కూడా ఉంది
- ప్రత్యామ్నాయం చూపించాలి
- నెలకు రూ.15 వేల భృతి చెల్లించాలి
- ఆటో డ్రైవర్ల నిరసన, ఆందోళన



పరకాల: పట్టణంలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము జీవనోపాధి కోల్పోయామని, తమకు నెలకు రూ.15 వేల భృతి చెల్లించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో తమపాత్ర కూడా ఉందని, మాకు అన్యాయం చేయొద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆటో బంద్ పాటించి నిరసన, ఆందోళన చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు మాట్లాడారు. పలువురు ఆటో డ్రైవర్లు, యజమానులు ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు గిరాకీ తగ్గిపోవడంతో వారు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఆటోల నెలవారి కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొందని, ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీల నుంచి ఈఎంఐ కట్టాలని ఒత్తిడి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా నిలబడి మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని, లేదంటే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నాయబ్ తహసీల్దార్ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కూనూరు రవి, ఉపాధ్యక్షులు మౌటం లింగమూర్తి, అంకిల్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి ఆవునూరి తిరుపతి, సహాయ కార్యదర్శి దుండ్ర రాజు, కోశాధికారి మేడిపెల్లి సారంగం, ఆటో డ్రైవర్లు వనం రాజేందర్, మౌటం అశోక్, లింగమూర్తి, కుమారస్వామి, మేడిపెల్లి రాజు, ఐలయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో తమ జీవనోపాధి దెబ్బతిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. పరకాల– హనుమకొండ ప్రధాన రహదారిలోని మాందారిపేట ప్రధాన రోడ్డుపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆటో కార్మికులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ కార్మికులు మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికుల జీవనోపాధి కోల్పోయారని అన్నారు. ఆటో డ్రైవింగ్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికుల బతుకులు బజారున పడ్డాయని మండిపడ్డారు. అప్పులు తెచ్చి, ప్రైవేట్ ఫైనాన్స్‌ల నుంచి ఆటోలు కొనుగోలు చేసుకున్నామని, బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో మహిళలు ఆటోల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఫైనాన్స్ కిస్తీలు కట్టె పరిస్థితి లేదని, ఆటోలకు రోడ్డు టాక్స్ ఎత్తివేయాలని ఆటో కార్మికులకు ఉపాధి మార్గాలు చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు గున్ని రాజు, మాచర్ల సదయ్య, బాసాని శ్రీనివాస్, నామని భద్రయ్య, శ్రీకాంత్, రాజు, ప్రవీణ్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, యజమానులు



శాయంపేట : మాందారిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

పరకాలలో..

పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం రద్దు చేయాలని కోరుతూ పరకాల ఆటో డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ, బస్టాండ్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో తాము జీవనోపాధి కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, భిక్షపతి, రాము, సురేష్, కుమార్, క్రాంతి, మధుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే పెన్షనర్స్ సమావేశం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సంగమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి రైల్వే ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో సమావేశాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు.

మాల మహానాడు రాష్ట్ర కమిటీ రద్దు

హన్మకొండ: తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు మహానాడు జాతీయ అధ్యక్షుడు గొల్ల అరుణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాలల హక్కుల సాధనకు పనిచేసే వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పూర్వ కమిటీ బాధ్యులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

పూజిత అక్షింతలకు స్వాగతం

కాజీపేట: శ్రీరామ జన్మభూమి అయోధ్య తీర్థక్షేత్రం శ్రీరాంలీల మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ జరిపిన పూజిత అక్షింతలు కాజీపేట పట్టణానికి శనివారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతలకు విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెసరు తిలక్, చాడ శ్రీనివాస్ రెడ్డి, దీపక్ కొల్హారియ, రావుల కిషన్, శ్రీరామ ఉదయ్‌కుమార్, ప్రసాద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ శాఖ మంత్రిని కలిసిన బ్రాహ్మణ సేవా సమితి నాయకులు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, సమితి రాష్ట్ర కార్యదర్శి జీవీఎస్ శ్రీనివాసాచారి కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన సీతంపేటకు చెందిన గోపరాజు చంద్రయ్య కుటుంబాన్ని హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గిన్నారపు సదానందం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

వేలేరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పోగ్రాం నోడల్ ఆఫీసర్ ఎండీ.అక్తరున్నీసా కోరారు. మండలంలోని బండతండా గ్రామంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలను డిజిటల్ వీడియో ద్వారా వివరించారు. అర్హులైన వారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోతు సంపత్, పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ కుమార్, ఉపసర్పంచ్ సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శిలు రవీందర్, భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ అక్తరున్నీసా

క్రీడలతో మానసికోల్లాసం

శాయంపేట : క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా స్థాయి రన్నింగ్, షాట్‌పుట్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మోహన్‌కృష్ణ మొదటి బహుమతి సాధించగా ప్రిన్సిపాల్ అభినందించి ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్

విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాలి

ఐనవోలు: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు సూచించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పురోగతి, అంశాలు, పాఠశాలలో అమలవుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై చర్చించారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న హెచ్‌ఎం

వేసెక్టమీ శస్త్రచికిత్సపై అవగాహన పక్షోత్సవాలు

నయీంనగర్: వేసెక్టమీ అవగాహన, శస్త్రచికిత్సల పక్షోత్సవాలను ఈనెల 11నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. పక్షోత్సవాల్లో భాగంగా హనుమకొండ పోచమ్మకుంట యూపీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన వేసక్టమీ శస్త్రచికిత్స శిబిరంలో 16మంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నందుకు వారిని సాంబశివరావు అభినందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఎన్ఎస్‌వీ సర్జన్ డాక్టర్ ఎండీ.యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో పురుషుల కోసం ఎన్ఎస్‌వీ క్యాంపులను ఏర్పాటు చేసినట్టు డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, మాస్ మీడియా అధికారి వీ.అశోక్‌రెడ్డి, ఎస్‌ఓ ప్రసన్నకుమార్, సీహెచ్‌ఓ మాధవరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేసెక్టమీ చేసుకున్న వారితో యాకూబ్‌పాషా

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

హన్మకొండ: జాతీయ స్థాయి యోగా పోటీలకు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన భాను ఎంపికయ్యారని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. చేర్యాల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భాను.. ఇటీవల నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో భాను పాల్గొననున్నట్లు తెలిపారు. ఈమేరకు భానును యోగా గురువులు పోశాల శ్రీనివాస్, సునీత సన్మానించారు.

కోటలో పర్యాటకుల సందడి



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటను తిలకించేందుకు పలు పాఠశాల విద్యార్థులు, పర్యాటకులు శనివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శిల్పాల ప్రాంగణంతోపాటు కోట పరిసరాలు జనంతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా నాలుగు కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుతమైన శిల్పకళా సంపద, ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలను వారు తిలకించారు. నల్లరాతిలో చెక్కిన శిల్ప సంపద.. పర్యాటకులకు కనువిందు చేసింది. శిల్పాలను కాకతీయుల విశిష్టతను విద్యార్థులకు కోట గైడ్ రవియాదవ్ వివరించారు. టీఎస్ టీడీసీ ఇన్‌చార్జ్ అజయ్, కేంద్ర పురావస్తుశాఖ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ ఆలయంలో ధనుర్మాసోత్సవం

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, అర్చకుడు జయకృష్ణ ఆచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధనుర్మాస ఉత్సవాలు నేటి నుంచి 2024 జనవరి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమైన విశేష కార్యక్రమాల్లో భాగంగా 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక పుష్పార్చన, 24 నుంచి 26 వరకు అధ్యయన ఉత్సవాలు, 2024 జనవరి 4న కుత్తు విళ్లక్కు దీపోత్సవం, 12న కూడారై ఉత్సవం, 13న సాయంత్రం గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల పరిధిలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



స్తంభాకృతిగా వెలిసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం

- మంద కృష్ణమాదిగ

దామెర: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పాముల సుబ్బయ్య పాత్ర కీలకమని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని పులుకుర్తికి చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు పాముల సబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం సబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు.. సుబ్బయ్య ఎస్సీ వర్గీకరణ కోసం క్రియాశీలకంగా పని చేశాడని అన్నారు. ఎమ్మార్పీఎస్ తరుపున బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి, జాతీయ నాయకులు సూరన్న, మంద రాజు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బందారి సురేందర్, సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, గోవిందు అశోక్, ఎంపీటీసీ గోవిందు సంధ్యఅశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మందకృష్ణ

పంబారట్టును విజయవంతం చేయాలి

దామెర: మండల కేంద్రంలో ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న పంబారట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయ్యప్పస్వాములు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయ్యప్పస్వామి విగ్రహంతో శోభయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరవకు గ్రామంలోని గిద్దె చెరువులో స్వామివారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పంబారట్టు (జల క్రీడ) నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో అయ్యప్పస్వాములు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలం కృపాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బిల్లా రమణారెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, గరిగె కృష్ణమూర్తి, అనిల్‌రెడ్డి, వేల్పుల ప్రసాద్, మొద్దు ప్రవీణ్, దుర్శెట్టి భిక్షపతి, అయ్యప్ప స్వాములు ఆలేటి సునీల్‌కుమార్, ఎక్కలదేవి శ్రావణ్, కార్తీక్, సంపత్, రవికుమార్, రమేష్, జయపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలాధారులు

మహా ధర్నా కరపత్రాల ఆవిష్కరణ



మహా ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు

ఎల్కతుర్తి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 21వ తేదీన చేపట్టనున్న మహా ధర్నా కరపత్రాలను భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల చక్రపాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ ఈనెల 21న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలంతా అధిక సంఖ్యలో తరలివచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడిపె వీరస్వామి, అంబాల బక్కరాజు, ఐలయ్య, కొమ్ముల రాజు, రమేష్, చిరంజీవి, కిరణ్, సదానందంతో పాటు ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ఆత్మకూరు : అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుకుంటున్న సాదు కావ్య అండర్–14 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ టేకుమల్ల వాసవి, వ్యాయమ ఉపాధ్యాయురాలు గజ్జెల సుమలత తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థినికి మెమోంటో అందించి అభినందించారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు శైలజ, స్వప్న, వాసవి, చైతన్య, రజిత, రమాదేవి, హబీబా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని నికెల అర్చన ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కే.స్రవంతి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న మహబూబాబాద్‌లో జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పీఈటీ కిరణ్మయి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



అర్చన